అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తాం

- గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని బచ్చుగూడెం గ్రామంలో రూ.50 లక్షలతో చేపట్టిన అంతర్గత మురుగు నీటి కాలువలు, వీధిదీపాలు, హైమాస్ట్ లైట్లను ప్రజాప్రతినిధులతో సోమవారం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో నియోజకవర్గంలోని మేజర్ గ్రామపంచాయతీలతో పాటు నూతన గ్రామపంచాయతీలను సైతం అభివృద్ధి పథంలో తీసుకువెళ్లామని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లోనూ శరవేగంగా అభివృద్ధి పనులు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుమతి, ఎంపీటీసీ మమత, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రేశం మల్లికార్జునస్వామికి పూజలు

పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామంలో సోమవారం నిర్వహించిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం, జాతర కార్యక్రమాలకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహులు, పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బండి శంకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్ అని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీకి చెందిన లక్ష్మి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దీంతో మెరుగైన వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీని లక్ష్మి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సోమవారం అందజేశారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, ప్రమోద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బాధితులను ఆదుకోండి

సంగారెడ్డి టౌన్: ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి గ్రామంలో ఇళ్లు, రేకుల షెడ్లు కోల్పోయిన బాధితులను ఆదుకోవాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. ఈ మేరకు సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సర్పంచ్ ఓం ప్రకాష్, బాధితులతో కలిసి కలెక్టర్ క్రాంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లు, రేకులషెడ్లు కూల్చివేసి అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారని, ఇది సరైనదికాదని మండిపడ్డారు. ఇళ్ల కూల్చివేతలో అత్యుత్సాహం ప్రదర్శించిన అధికారులపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేశం, బాధితులు పాల్గొన్నారు.



కలెక్టర్ క్రాంతికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

సమస్యలను సత్వరమే పరిష్కరించండి

సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): సమస్యలను సత్వరమే పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ ప్రవీణ అధ్యక్షతన గుమ్మడిదల మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి నివేదికలను వివరించారు. గుమ్మడిదల పీహెచ్‌సీలో అనేక సమస్యలు ఉన్నాయని, దీంతో రోగులు ఆస్పత్రికి వెళ్లేందుకు ముందుకురావటం లేదని సభ్యులు వాపోయారు. అదేవిధంగా విద్యుత్ సమస్యలు తీవ్రంగా ఉన్నాయని, కరెంటు స్తంభాలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వెంటనే సమస్యను పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. పీసీబీ అధికారులు సమావేశానికి గైర్హాజరు కావటంపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాత్రి సమయంలో పరిశ్రమల నుంచి వ్యర్థ పదార్థాల దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో స్థానిక ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు ఆరోపించారు. అనంతరం ఎంపీపీ ప్రవీణ మాట్లాడుతూ ఐదేళ్లుగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు వారి విధులను సక్రమంగా నిర్వహించారని తెలిపారు. సభ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మంజుల, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



నివేదికను వివరిస్తున్న అధికారి

బైక్ దొంగకు రిమాండ్

పటాన్‌చెరు టౌన్: బైకు దొంగను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన ఉప్పడాల రాము బతుకుదెరువు కోసం ఇస్నాపూర్‌లో వచ్చి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఇస్నాపూర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో రామును పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా పాత నేరస్తుడిగా గుర్తించారు. ఈ నెల 9వ తేదీన ముత్తంగిలో బైక్ దొంగలించి విజయనగరంలో అమ్మివేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు నిందితుడిని రిమాండ్ తరలించారు. నిందితుడు ఇటీవలే దొంగతనాల కేసులో ఆరు నెలలు జైలు శిక్షణ అనుభవించి వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలు కాలనీలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు కార్పొరేటర్‌కు యాదవ శ్మశానవాటికలో ప్రహరీ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి తన సొంత నిధులతో ప్రహరీని నిర్మిస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా చైతన్యనగర్, రజకబస్తీలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ సమస్య, స్పీడ్ బ్రేకర్ సమస్యలు ఉన్నాయని రజక సంఘం సభ్యులు కార్పొరేటర్ కుమార్ యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం గొల్లబస్తీలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు వెడల్పు పనులకు స్థానికుడు ఒకరు అడ్డు పడుతున్నారని తెలుసుకున్న కార్పొరేటర్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో కలసి సందర్శించి సమస్యను పరిష్కరించారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటిద్దాం



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

మునిపల్లి(అందోల్): ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌అంటీ సిబ్బంది పాల్గొన్నారు

తారా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో..

సంగారెడ్డి అర్బన్: తారా డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పట్టణంలోని ఐబీ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రధానంగా ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడంతోనే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, వెంకటేశం, సిద్దులు, పద్మజ, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు రంజిత్‌రెడ్డి, సంతోష్, అమర్, సృజన పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

సదాశివపేట(సంగారెడ్డి): సామాజిక సేవే లక్ష్యంగా పని చేస్తున్న రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తనయుడు సాయినాథ్ అన్నారు. రోటరీ క్లబ్ లేక్ జిల్లా మొహినాబాద్ హ్యాపీ స్కూల్ ప్రాజెక్ట్‌లో భాగంగా పట్టణంలోని న్యూ గవర్నమెంట్ ఉన్నత పాఠశాలలో ఫెర్నాండెజ్ ఫౌండేషన్ మా ఐఎస్‌టీ సౌజన్యంతో విద్యార్థులకు ఇన్‌టీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం సీసీ టీవీ కెమెరా, బుక్ రాక్స్, బూట్లు, క్రీడా పరికరాలు, కంప్యూటర్, నూతన పుస్తకాలు కుర్చీలు, టెబుల్స్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సంగారెడ్డి అధ్యక్షురాలు అచల, కార్యదర్శి రాజశేఖర్ ఓడెల, పట్టణంలోని ఈశ్వర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణే మొదటి మెట్టు

జహీరాబాద్: విద్యార్థులకు క్రమశిక్షణే తొలి మెట్టు కావాలని ఎస్‌ఐ శ్రీకాంత్, ఎంఈఓ బస్వరాజ్ అన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీక్రిష్ణవేణి ఉన్నత పాఠశాలల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులను క్రమశిక్షకులుగా తీర్చిదిద్దే విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. చిన్నపిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత పడాలని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్ మాయలో పడి చదువులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీంతో వారి బంగారు భవిష్యత్తు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ వెదిరె అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ వశిష్టారెడ్డి, నిజాం, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

ఇద్దరికి రిమాండ్

పరారీలో మరొకరు

పటాన్‌చెరు టౌన్: మెడికల్ షాపు నిర్వాహకుడిని తీవ్రంగా కొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన ముగ్గురు నిందితుల్లో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించారు. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, క్రైమ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన వెంకటేష్ వ్యక్తి పటాన్‌చెరు మండల పరిధిలోని ఇస్నాపూర్‌లోని మెడికల్ షాపు నిర్వహిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 27న తేదీ రాత్రి మెడికల్ షాపు మూసివేసి సంగారెడ్డికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రుద్రారం గ్రామ శివారులోని పరివార్ దాబా దాటిన తర్వాత ఫోన్ వస్తే ఆగి మాట్లాడుతున్నాడు. అదే సమయంలో శిఖండి(హిజ్రా)డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. దీంతో నిరాకరించడంతో మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి వెంకటేష్‌ను పక్కనే ఉన్న చెట్లపొదల్లోకి తీసుకెళ్లి అతని వద్ద ఉన్న రూ.18,500 నగదు, సెల్‌ఫోన్ తీసుకొని పరారయ్యారు. దీంతో బాధితుడు ఆదివారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పటాన్‌చెరు పాత టోల్ గేట్ సమీపంలో ఈ ఘటనతో ప్రమేయం ఉన్న చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన రమేష్ అలియాస్ దివ్య(శిఖండి), వికారాబాద్ జిల్లా నోవాపేట మండలం గేట్వనంపల్లికి చెందిన రమేష్‌ను సోమవారం పటాన్‌చెరు పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. మరొకరు పరారీలో ఉన్నట్లు త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

సర్పంచ్‌ల పదవీకాలం పెంచండి



మాట్లాడుతున్న సర్పంచ్‌లు

నారాయణఖేడ్: ప్రభుత్వం సర్పంచ్‌ల పదవీకాలాన్ని పెంచాలని పలువురు సర్పంచ్‌లు డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగన్‌వారి మాట్లాడుతూ సర్పంచ్‌లుగా ఎన్నికైన అనంతరం 8నెలల వరకు చెక్‌పవర్ ఇవ్వలేదన్నారు. గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి తమకు రూ.లక్షల్లో బిల్లులు రావాల్సి ఉందని వాపోయారు. తాము సర్పంచ్‌లుగా ఎన్నికైన నుంచి గ్రామాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశామని, దీంతో మళ్లీ ఎన్నికలు నిర్వహించే వరకు తమ పదవీకాలాన్ని పొడగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్‌లు ప్రసాద్, వెంకటేశం, రాజు, సాల్‌మన్, స్రవంతి, పరమేశ్వర్, విఠమ్మ, చాప్లిబాయి, నిగమ్మ, సువర్ణ ప్రభాకర్, జెడ్పీటీసీ లక్ష్మిబాయి, నాయకులు రవీందర్‌నాయక్, రైతుబంధు మాజీ అధ్యక్షుడు సత్యపాల్‌రెడ్డి, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

సిద్ధివినాయకుడి ఆలయాల్లో పూజలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో వెలసిన సిద్ధివినాయక ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని సోమవారం భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తులు వినాయకుడిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సిద్ధివినాయకుడిని దర్శించుకున్న జైపాల్‌రెడ్డి

జహీరాబాద్: రేజింతల్ గ్రామంలోని సిద్ధివినాయక ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర నాయకుడు, డీసీసీబీ మాజీ చైర్మన్ జైపాల్‌రెడ్డి దంపతులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట మల్‌చల్మ పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి ఉన్నారు.

పటాన్‌చెరు టౌన్: మండల పరిధి రుద్రారం గ్రామంలోని గణేష్‌గడ్డ ఆలయంలో సంకష్టహర చతుర్థి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంతోష్ జోషి, చంద్రశేఖర్ స్వామి, జగదీష్ స్వామి, ఆలయ ఈవో మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్, ఈశ్వర్లు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ ఏసీపీ పూజలు

జహీరాబాద్ పట్టణంలోని రామలింగేశ్వర దేవస్థానంలో నిజామాబాద్ సైబర్ క్రైమ్ ఏసీపీ వేణుగోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు మహేష్, గణేష్, భక్తులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు సన్మానం

జిన్నారం(పటాన్‌చెరు): ఐదేళ్ల పదవికాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లను ఎంపీపీ రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లకు మెమోంటోలను బహూకరించారు. ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులను, అనుభవాలను సర్పంచ్‌లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాములు, ఏపీఓ సంతోష్ ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో...

మునిపల్లి(అందోల్): మునిపల్లిసర్పంచ్ రమేశ్‌కు వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర బసవ డైరీని అందజేశారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం సభ్యులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ కాలేరు బాల్‌కిషన్ మృతి

నారాయణఖేడ్: మండల కేంద్రమైన నిజాంపేట్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు, నారాయణఖేడ్ మాజీ ఎంపీపీ కాలేరు బాల్‌కిషన్ (58) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతిపట్ల ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్‌షెట్కార్, కాంగ్రెస్ ముఖ్య నాయకులు నగేష్ షెట్కార్, చంద్రశేఖర్‌రెడ్డి, శంకరయ్యస్వామి, రశీద్, కాంగ్రెస్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు, అమీన్‌పూర్ కౌన్సిలర్ కాటా సుధారాణి అన్నారు. సోమవారం పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామంలో జరిగిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి జాతరలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణిని ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, ఇంద్రేశం ఉపసర్పంచ్ శివగౌడ్, రామేశ్వరంబండ వార్డుసభ్యులు నాగరాజు ముదిరాజ్, నాయకులు పాల్గొన్నారు.

◆ పంచాయతీ పాలకవర్గానికి వీడ్కోలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మామిడ్గి గ్రామ పంచాయతీ పాలకవర్గ వీడ్కోలు కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్, వార్డుసభ్యుల పదవికాలం మరో రెండు రోజుల్లో ముగియనున్నందునా పాలకవర్గ సభ్యులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఎంపీఓ సరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ జగనాథ్‌రెడ్డి, నాయకులు తుక్కారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గౌసోద్దీన్, ఐకేసీ సీఏ ఇంద్రసేనారెడ్డి, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని వైకుంఠపురంలో అల్లాదుర్గం సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆలయ ప్రధాన అర్చకులు కండాడై వరదాచార్యులు సోమవారం ఆవిష్కరించారు. ఫోరం అధ్యక్షుడు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సార ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కొంకా రాజేశ్వర్, సంఘం ప్రతినిధులు ప్రేమచందర్, జిన్న సంగారెడ్డి, హనుమయ్య, శ్రీరామ్ నవీన్, శ్రీనివాస్, శంషాబాద్ శ్రీనివాస్, రవి, రవీందర్, విఠల్, సత్యయ్య, మల్లికార్జునపాటిల్ పాల్గొన్నారు.

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని ఆయా కాలనీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. డివిజన్ పరిధిలోని కాకతీయనగర్ కాలనీలో సోమవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లను నిర్మిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ కార్మికులను తొలగించడం అన్యాయం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి యాదగిరి అన్నారు. కార్మికుల తొలగింపు నిరసనగా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నోట్‌బుక్స్ పంపిణీ



నోట్‌బుక్స్ చూపుతున్న విద్యార్థులు

నారాయణఖేడ్: మండల పరిధిలోని అబ్బెంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్‌సేవ, ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నోటుపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూత్ ఫర్‌సేవ బాధ్యులు చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికా విద్య ప్రాధాన్యంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

కోహీర్(జహీరాబాద్): బాలిక విద్య ప్రాధాన్యతను తెలుపుతూ పట్టణంలోని ప్రధాన వీధుల్లో మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థినులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థునులు స్కౌట్స్ గైడ్స్ బ్యాండ్ వాయిస్తూ నిర్వహించిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ అలియా ఫరిదా విద్యార్థిణులకు విద్య ప్రాధాన్యతను వివరించారు.

ఒకే తండా నుంచి 9మంది స్టాఫ్ నర్సులు



స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన గిరిజనులు

నారాయణఖేడ్: ప్రభుత్వం ప్రకటించిన స్టాఫ్ నర్స్ మేయిల్, ఫిమేయిల్ ఎంపికకు సంబంధించి ఫలితాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నారాయణఖేడ్ మండల పరిధిలోని తుర్కాపల్లి తండాకు చెందిన తొమ్మిది మంది ఒకేసారి ఉద్యోగులుగా ఎంపికయ్యారు. ప్రభుత్వం స్టాఫ్ నర్సుల నియామకం కోసం 2022లో నోటిఫికేషన్ విడుదల చేయగా గత సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను విడుదల చేయడంతో తండాకు చెందిన విజయ్, వినోద్, రాజు, మోహన్, సంగ్రాం, చైతన్, రజిత, మౌనిక, ప్రియాంక ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఒకేసారి తొమ్మిది మంది తమ తండా నుంచి స్టాఫ్ నర్సులుగా ఎంపిక కావడం పట్ల కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకులు నెహ్రూనాయక్ హర్షం వ్యక్తం చేశారు.

నీటి ట్యాంకర్ల పట్టివేత



నీటి ట్యాంకర్లను సీజ్ చేసిన అధికారులు

కంది(సంగారెడ్డి): మండల పరిధిలోని ఇంద్రకరణ్ గ్రామంలో అక్రమంగా నీటిని తరలిస్తున్న మూడు ట్యాంకర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అనంతరం ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయలక్ష్మి మాట్లాడుతూ వాల్టా చట్టాన్ని ఉల్లంఘిస్తూ నీటిని తరలించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



బసవ డైరీని ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ విజయలక్ష్మి, నాయకులు

మునిపల్లి(అందోల్): మునిపల్లిలో ఎంపీటీసీ క్యాంపు కార్యాలయంలో 2024 సంవత్సరానికి సంబంధించిన బసవ డైరీని ఎంపీటీసీ విజయలక్ష్మి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరశైవ లింగాయత్‌లు, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ విజయలక్ష్మిని వీరశైవ లింగాయత్‌లు సన్మానించారు.